క్లుప్తంగా

అంధుల పాఠశాల సందర్శన


పాఠశాల సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న వెంకట శేషమ్మ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–9లోని హెలెన్ కెల్లర్ అంధుల పాఠశాలను శనివారం ఉయదం జిల్లా సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో సమావేశమయ్యారు. ఎంత మంది వసతి పొందుతున్నారు, వసతి, భోజన సౌకర్యాలు, తరగతి గదులు ఎలా ఉన్నాయని విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై ప్రస్తుతం దివ్యాంగులు, యువతకు ఉన్న చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ ఇ.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహా అన్నదానం


రెల్లి వీధిలో అన్నప్రసాదం వడ్డిస్తున్న అచ్యుతరావు, నిర్వాహకులు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరు రెల్లి వీధిలోని విజయదుర్గ అమ్మవారి మహోత్సవాల సందర్భంగా శనివారం మధ్యాహ్నం మహా అన్నసమారాధన జరిగింది. ముఖ్య అతిథి ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన చేతుల మీదుగా అన్నదానం ప్రారంభించారు. సుమారు 3 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు.

ఫుట్‌పాత్‌పై గొయ్యి


సాగరతీరంలో ఫుట్‌పాత్‌పై ఏర్పడిన గొయ్యి

ఏయూక్యాంపస్: సాగర తీరంలో అరకు కాఫీ షాప్‌నకు ఎదురుగా కోకో ఎరీనాను ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌పై భారీ గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో సందర్శకులు దీనిలో పడి గాయాలపాలయ్యే అవకాశముంది. జీవీఎంసీ అధికారులు గుంతను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'వాతావరణ మార్పులు, వ్యవసాయం'పై సదస్సు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ నరసింహారావు

విశాఖ సిటీ: వ్యవసాయ ఆర్థిక పరిశోధన కేంద్రం(ఏఈఆర్‌సీ), భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖతో కలిసి 'వాతావరణ మార్పులు, భారతీయ వ్యవసాయం–సుస్థిర పద్ధతులు' అనే అంశంపై శనివారం ఏయూలో సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వాణిజ్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా సుస్థిర వ్యవసాయ పద్ధతుల అవసరాన్ని వివరించారు. ఏఈఆర్‌సీ మాజీ డైరెక్టర్ డాక్టర్ టి.వి.ఎస్.రావు మాట్లాడుతూ వ్యవసాయంలో వాతావరణ మార్పులతో కూడిన సవాళ్లు, అవకాశాలను విశదీకరించారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జె.మోహనరావు మాట్లాడుతూ వాతావరణానికి అనుగుణమైన వ్యవసాయ విధానాల అన్వయంపై అనుభవాలను పంచుకున్నారు. సదస్సులో ప్రొఫెసర్ సాంబమూర్తి, ఏఈఆర్‌సీ పరిశోధకులు డాక్టర్ కె.ఆదిశేషు, డాక్టర్ కె.వి.గిరిబాబు, ఏఈఆర్‌సీ ఆనరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.లిల్లీగ్రేస్ యూనిస్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

షెడ్ వేసి అమ్మేశారు..

- ప్రభుత్వ స్థలాన్ని విక్రయించేసిన టీడీపీ నాయకులు
- శ్రీకృష్ణాపురం ప్రాంతంలో రెచ్చిపోతున్న తమ్ముళ్లు
- వీరి బెదిరింపులతో కన్నెత్తి చూడని అధికారులు


శ్రీకృష్ణాపురంలో టీడీపీ నాయకులు విక్రయించేసిన జీవీఎంసీ స్థలం
(ఈ స్థలంలో రేకుల షెడ్, చుట్టూ ప్రహరీ నిర్మించి అమ్మేశారు.)

ఆరిలోవ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆరిలోవ ప్రాంతంలో టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. భూ ఆక్రమణలు, అక్రమాలు, అనధికారిక నిర్మాణాలకు పాల్పడుతున్నారు. ఇదే అదనుగా 13వ వార్డు శ్రీకృష్ణాపురంలో కొందరు టీడీపీ నాయకులు జీవీఎంసీకి చెందిన స్థలాన్నే వేరొకరికి విక్రయించేశారు. 10వ వార్డు రవీంద్రనగర్‌లో సామాజిక భవనానికి చెందిన ఖాళీ స్థలాన్ని కొద్ది రోజుల కిందట సంఘం పెద్దలు విక్రయించేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం మరువక ముందే శ్రీకృష్ణాపురంలోని జీవీఎంసీ స్థలాన్ని అమ్మేయడం చర్చనీయాంశంగా మారింది.

దర్జాగా రేకుల షెడ్ నిర్మాణం

శ్రీకృష్ణాపురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వీధిలో జీవీఎంసీకి చెందిన సుమారు 100 చదరపు గజాల స్థలం ఖాళీగా ఉంది. అందులో విద్యుత్ విభాగం అధికారులు కొన్నేళ్ల కిందట ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. గతంలో ఈ స్థలాన్ని ఏదైనా గుడి కోసం వినియోగించుకోవాలని గ్రామ సంఘ పెద్దలు నిర్ణయించారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడా స్థలాన్ని విక్రయించేశారని తెలియడంతో వారు ఆశ్చర్యపోతున్నారు. దానిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏడాది క్రితమే కొందరు వేరే చోటకు తరలించేశారు. అనంతరం దర్జాగా ఆ స్థలంలో రేకుల షెడ్ నిర్మించారు. విషయం తెలుసుకున్న జీవీఎంసీ జోన్–2 అధికారులు ఆ షెడ్‌ను స్థానిక సచివాలయం సిబ్బందిచే తొలగింపజేశారు. అప్పటికి ఆ ఆక్రమణకు బ్రేక్ పడింది.

రూ.19 లక్షలకు విక్రయం!

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శ్రీకృష్ణాపురంలో ఓ టీడీపీ నాయకుడు, వార్డులో మరికొందరు తెలుగుదేశం నాయకుల సహాయంతో ఎమ్మెల్యే వెలగపూడి పేరు చెప్పి ఆ స్థలాన్ని వేరొక వ్యక్తికి అమ్మేశారు. దీన్ని సుమారు రూ.19 లక్షలకు విక్రయించినట్లు విశ్వసనీయ సమాచారం. విక్రయం జరిపిన వెంటనే ఆ స్థలంలో టీడీపీ నాయకులే ఆఘమేఘాలపై రేకుల షెడ్ నిర్మించేశారు. దాన్ని అడ్డుకోవడానికి వెళ్లిన సచివాలయ సిబ్బందిని ఎమ్మెల్యే పేరు చెప్పి బెదిరించినట్లు తెలిసింది. దీంతో సచివాలయ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని కనీసం ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లలేకపోవడం విశేషం. గ్రామంలో జీవీఎంసీకి చెందిన ఈ స్థలం విక్రయంపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ స్థలాన్ని జీవీఎంసీ అధికారులు స్వాధీనం చేసుకొని గ్రామాభివృద్ధి కోసం వినియోగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వార్డుల్లో టీడీపీ నాయకుల అక్రమాలు పెరిగిపోయాయని స్థానిక ప్రజలు అంటున్నారు.

మెడికల్ వ్యర్థాల తొలగింపు


మానసిక ఆస్పత్రి వద్ద మెడికల్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేసిన రోడ్డు


డస్ట్ బిన్లలో వేసిన వ్యర్థాలు

సాక్షి ఎఫెక్ట్..

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో సిబ్బంది నిర్లక్ష్యంతో మెడికల్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేశారు. వీటి వల్ల రోగాలు వచ్చే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై 'వ్యర్థం.. అనర్థం..!' అనే శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి ఆస్పత్రి ఉన్నతాధికారులు తక్షణం స్పందించారు. బహిరంగ ప్రదేశంలో డంప్ చేసిన మెడికల్ వ్యర్థాలను తొలగింపజేశారు. మెడికల్ వేస్ట్ మొత్తాన్ని దూర ప్రాంతాలకు తరలించారు. ఆస్పత్రి వద్ద నిరుపయోగంగా ఉన్న డస్ట్ బిన్లలో ఇతర వ్యర్థాలను వేశారు.

విద్యా రంగ పరిరక్షణకు పోరాటమే శరణ్యం

- యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అంబేడ్కర్



నూతన కమిటీతో ప్రమాణం చేయిస్తున్న అంబేడ్కర్

విశాఖ విద్య: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్ అన్నారు. తోటగరువు ఉన్నత పాఠశాలలో చినగదిలి యూటీఎఫ్ మండల శాఖ 50వ స్వర్ణోత్సవ మహా సభ జిల్లా అధ్యక్షుడు నేతల ప్రభాకర్ అధ్యక్షతన శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేడ్కర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి రాజీలేని పోరాటానికి సన్నద్ధులు కావాలన్నారు. ఈ సందర్భంగా చినగదిలి మండల కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్.ప్రసాద్, అధ్యక్షుడిగా మురళీ, ప్రధాన కార్యదర్శిగా పద్మావతి, కోశాధికారిగా కుమారి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పి.సురేష్, జి.ఉషారాణి, రాజేశ్వరి, జగన్, నీలాద్రి పాల్గొన్నారు.

ఇల్లు ఖాళీ చేయాలని భార్యాభర్తలపై దాడి

ఆరిలోవ: ఇల్లు ఖాళీ చేయాలంటూ భార్యాభర్తలపై నలుగురు యువకులు శనివారం దాడికి దిగారు. స్థానికులు, ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 10వ వార్డు తోటగరువు దరి బీఎస్ఆర్ నగర్‌లో తోడుకోడళ్లు పద్మ, పావని కుటుంబాలు పక్కపక్క ఇళ్లలో నివసిస్తున్నారు. వారిరువురివీ సొంతిళ్లే. పావని కుటుంబం ఆ ఇంట్లో ఉండటం పద్మ కుటుంబానికి ఇష్టం లేదు. దీంతో కొద్ది రోజులుగా ఇల్లు ఖాళీ చేసి వేరేచోటకు వెళ్లిపోవాలని పావనిపై పద్మ కుటుంబ సభ్యులు ఒత్తిడి చేస్తున్నారు. ఇందులో భాగంగా పద్మ కుమారుడు తులసి శనివారం తోటగరువు, అంబేడ్కర్ నగర్‌కు చెందిన మరో ముగ్గురు స్నేహితులతో కలసి పావని ఇంటికి వెళ్లారు. ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోమని చెబితే ఎందుకు వెళ్లడం లేదంటూ పెద్దగా అరుస్తూ ఇంట్లో ఉన్న పావని, ఆమె భర్తపై కర్రలు, పెనంతో దాడి చేశారు. దీంతో పావని, ఆమె భర్తకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. భార్యాభర్తలు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎమ్మెల్సీ కోసం విమ్స్‌కు వెళ్లారు. ప్రస్తుతం వారిద్దరు విమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల ద్వారా వివరాలు సేకరించారు. దాడికి పాల్పడిన తులసితో పాటు అతడి ముగ్గురు స్నేహితులను అదుపులోకి తీసుకున్నారు.

ఆకట్టుకున్న చేనేత వస్త్ర ప్రదర్శన


చేనేత వస్త్రాలు విక్రయిస్తున్న మహిళలు

ఎంవీపీకాలనీ: దయాళ్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రారంభించిన వస్త్ర ప్రదర్శన వినియోగదారులను ఆకట్టుకుంది. ఇన్‌స్టిట్యూట్ ద్వారా శిక్షణ పొందిన మహిళలు, విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో తయారు చేసిన చేనేత వస్త్రాలను ఇక్కడ ప్రదర్శించి విక్రయించారు. ఈ సందర్భంగా ప్రదర్శన నిర్వాహకులు దక్షిణామూర్తి, ప్రేమ్ స్వరూప్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను తక్కువ ధరకే సంస్థ ద్వారా విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలు ఎగ్జిబిషన్లు నిర్వహించినట్లు వెల్లడించిన వారు విశాఖలో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ ఐదోదిగా పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం వరకు విక్రయాలు జరుగుతాయన్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం


పిఠాపురం కాలనీ సర్వీస్ రోడ్డులో విరిగిన విద్యుత్ స్తంభం


విద్యుత్ సిబ్బంది చెట్టుకు కట్టి నిలబెట్టిన స్తంభం

మద్దిలపాలెం: పిఠాపురం కాలనీ సర్వీస్ రోడ్డులోని పాత విద్యుత్ కార్యాలయం వద్ద ఓ స్తంభం విరిగి ప్రమాదభరితంగా మారింది. ఈ స్తంభాన్ని ఓ వాహనం ఢీకొట్టడంతో అడుగు భాగం పూర్తిగా ధ్వంసమై పక్కకు ఒరిగిపోయింది. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది శనివారం విరిగిన స్తంభాన్ని పరిశీలించారు. పూర్తిగా తొలగించాల్సిన ఆ స్తంభాన్ని అక్కడ ఒక చెట్టుకు కట్టి నిలబెట్టారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఇలా చెట్టుకు కట్టి స్తంభాన్ని వదిలేస్తే ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు ప్రమాదానికి గురైన అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే ఆ స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు. స్తంభాన్ని ఢీకొట్టిన వాహనాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రౌడీషీట్లు తెరుస్తాం


ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు, గొడవలను కట్టడి చేయడానికి చర్యలు చేపడుతున్నామని సీఐ హెచ్.మల్లేశ్వరరావు తెలిపారు. రెండు రోజుల కిందట ఇక్కడ సీఐగా ఆయన బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్లు ఉన్నాయని ఆయనను కలిసి విలేకరులకు తెలిపారు. వాటిలో ఇతర ప్రాంతాలకు చెదిన వ్యక్తులపై కూడా రౌడీషీట్లు తెరిచి ఉన్నట్లు తెలిపారు. అలాంటి వారిని ఏ ప్రాంతానికి చెందినవారో ఆయా పోలీస్ స్టేషన్లకు అప్పగించేస్తామన్నారు. అల్లర్లు, గొడవలకు దిగుతున్నవారి కేసుల తీవ్రతను బట్టి కొత్తగా రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎవరూ నేరాలకు పాల్పడకుండా ఉండాలని సీఐ సూచించారు. నేరాల నియంత్రణకు స్థానికులు సహకారం కూడా పోలీసులకు అవసరమన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు ప్రతిభ చూపారు. అనకాపల్లి జిల్లా కొక్కిరాపల్లిలో జరిగిన పోటీల్లో పాల్గొన్న గురుకుల విద్యార్థులు కె.బాలు(9వ తరగతి), ఎల్.కార్తీక్(ఇంటర్ ఫస్టియర్) డ్రాయింగ్ విభాగంలో ఉమ్మడిగా ప్రథమ బహుమతి సాధించారు. ఈ విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన ఆర్ట్ టీచర్ పి.సుధాకర్‌ను, వారిని ప్రోత్సహిస్తున్న గురుకుల ప్రిన్సిపాల్ రత్నవల్లిని గురుకులాల ఉమ్మడి జిల్లా కన్వీనర్ రూపవతి అభినందించారు. విద్యార్థులకు అవార్డు అందజేసి, భవిష్యత్‌లో మరిన్ని బహుమతులు అందుకోవాలని ఆకాంక్షించారు.

సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవం నేడు

ఎంవీపీకాలనీ: సత్యసాయిబాబా అవతార ప్రకటన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సమితి సభ్యులతో మహానగర సంకీర్తన చేస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పోలమాంబ ఆలయం వద్ద ఈ ర్యాలీ ప్రారంభమై పెదవాల్తేరు జంక్షన్, శాంతి ఆశ్రమం, లాసన్స్‌బే కాలనీ, ఉషోదయ కూడలి మీదుగా ఎంవీపీ కాలనీ సెక్టార్–8లోని సత్యసాయి ప్రేమసదన్‌కు చేరుతుందని చెప్పారు. సత్యసాయిబాబా భక్తులంతా పాల్గొనాలని కోరారు.

మత్స్యకార పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ


సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించి నమస్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం విద్యార్థులు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డు వాసవానిపాలెంలోని ప్రభుత్వ మత్స్యకార పాఠశాలలో శనివారం సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంచేందుకు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు స్కూల్ హెచ్ఎం సత్యవేణి తెలిపారు. నగరానికి చెందిన పొట్నూరు సురేష్‌కుమార్ తండ్రి జ్ఞాపకార్థం పాఠశాలకు ఈ విగ్రహాన్ని దానం ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లతో కూడిన కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎందుకిలా వదిలేశారు..!

- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ దుస్థితిపై జీవీఎంసీ కమిషనర్ మండిపాటు
- మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని ఆదేశం


స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

ఆరిలోవ: ముడసర్లోవ జంక్షన్ వద్ద హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో కొన్నేళ్ల పాటు నిర్వహించి ఖాళీ చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను శనివారం జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ సందర్శించారు. ఈ కేంద్రం లోపల అన్ని గదులు, పరిసరాలు చెత్త, ధూళితో నిండిపోవడాన్ని ఆయన గమనించారు. గోడలు శిథిలం కావడం, రంగులు వదిలేయడం, స్కిల్ డెవలప్‌మెంట్ నిర్వాహకులు విడిచిపెట్టిన చెత్త, విరిగిన పైపులుతో అస్తవ్యస్తంగా మారింది. దీంతో జీవీఎంసీ అధికారులపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని హెచ్‌పీసీఎల్ యాజమాన్యం ఖాళీ చేసి సుమారు ఏడాది కావస్తున్నా.. ఇంత నిర్లక్ష్యంగా ఎలా వదిలేస్తారంటూ మండిపడ్డారు. ఈ భవనం పూర్తిగా మరమ్మతులకు గురైందన్నారు. ఈ భవనాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంగా వినియోగించుకున్న హెచ్‌పీసీఎల్ అధికారులదే దీని బాధ్యతని తెలిపారు. వారు జీవీఎంసీకి సక్రమంగా అప్పగించ లేదని, హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి దీనిపై వెంటనే లేఖ పంపించాలని జోన్–2 కమిషనర్ సింహాచలంను ఆయన ఆదేశించారు. ఈ భవనంలోని అన్ని విభాగాల్లో వ్యర్థాలను తొలగించి, మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్ రాజుకు కమిషనర్ సంపత్‌కుమార్ సూచించారు. భవనం విస్తీర్ణం, దీనికి సంబంధించిన ఖాళీ స్థలం సర్వే చేయించి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న ఈ భవనంలో రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సెక్యూరిటీని నియమించాలని సూచించారు. పలువురు జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీ సరకులు సక్రమంగా అందించాలి


ఎంవీపీ రైతుబజార్‌లో వినియోగదారులతో మాట్లాడుతున్న జేడీ సుధాకర్

ఆరిలోవ: రైతుబజార్లలో సబ్సిడీపై ఇస్తున్న టమోటా, ఉల్లిపాయలను వినియోగదారులకు సక్రమంగా అందించాలని అధికారులకు మార్కెటింగ్ శాఖ విశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు(జేడీ) సుధాకర్ సూచించారు. ఎంవీపీ రైతుబజార్‌ను శనివారం ఆయన సందర్శించారు. సబ్సిడీపై అందిస్తున్న టమోటా, ఉల్లిపాయల కౌంటర్లను సందర్శించి వాటి నాణ్యతను పరిశీలించారు. రోజుకు ఎన్ని టన్నులు విక్రయం జరుగుతున్నాయో రైతుబజార్ ఈవో జి.ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల స్టాళ్ల వద్ద వినియోగదారుతో జేడీ మాట్లాడారు. బోర్డులపై ప్రకటించిన ధరలకు రైతులు, వ్యాపారులు సరకులు విక్రయిస్తున్నారా, ధరల్లో తేడాలు చెబుతున్నారా అంటూ ఆరా తీశారు. నాణ్యమైన సరకులు అందుబాటులో లేకపోతే ఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. కర్నూలు ఉల్లి రూ.37కి సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖాధికారి ఎస్.కె.యాసిన్, ఇంజినీర్ కెనడీ పాల్గొన్నారు.

ధరల పెరుగుదలపై ఇంటింటి ప్రచారం



ఆరిలోవలో ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెరిగిన నిత్యావసర సరకుల ధరలపై సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఆరిలోవలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. నాయకులు ఎర్ర జెండాలు, కూరగాయల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ పట్టుకొని ఆరిలోవ ఆపరేషన్ కాలనీ, పాండురంగాపురం, దుర్గాబజార్, ప్రాంతాల్లోని నివాసాలు, షాపుల వద్దకు ర్యాలీగా వెళ్లి ప్రచారం నిర్వహించారు. 'పెరిగిన ధరలు అదుపు చేయాలి. పెరిగిన ధరలకు హద్దే లేదా, ఏలేవాడికి బుద్ధే లేదా' అని అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి ఎస్కే రెహ్మాన్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువులపై పెరిగిన ధరలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అదుపు చేయాలని డిమాండ్ చేశారు. ధరలు పెరగడంతో సరకులు కొనలేక సామాన్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. నెలల తరబడి పెరిగిన ధరలతో సామాన్యుడి నడ్డి విరిగినట్లయిందన్నారు. సీపీఐ ఆరిలోవ జోన్ నాయకులు దేవుడమ్మ, కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

'కందుకూరి వీరేశలింగం'పై వక్తృత్వ పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మద్దిలపాలెం: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అనే అంశంపై మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం వక్తృత్వ పోటీలు నిర్వహించామని కళాభారతి కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. నగరంలోని వివిధ పాఠశాలల నుంచి 22 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. విజేతలకు ఈ నెల 24న బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా సూర్యారావు, వేణు, రమణమూర్తి వ్యవహరించారని పేర్కొన్నారు. వివిధ పాఠశాలలు, కళాశాల స్థాయిలో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యాసరచన ప్రతులను తమకు చేరగానే నిష్ణాతులచే విజేతలను ఎంపిక చేయనున్నామని తెలిపారు. కళాశాల స్థాయిలో వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి విజేతకు రూ.3 వేలు, ద్వితీయ రూ.2 వేలు, తృతీయ రూ.1,000, ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని రాంబాబు పేర్కొన్నారు. ఈ నెల 24న జరిగే బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా విశాఖ ఎంపీ శ్రీభరత్ హాజరు కానున్నారన్నారు.

కృష్ణా కళాశాలకు జెరాక్స్ మిషన్ వితరణ


జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు జెరాక్స్ మిషన్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు లయన్స్ క్లబ్ జెరాక్స్ మిషన్‌ను వితరణ చేసింది. దీన్ని కళాశాల ప్రిన్సిపాల్ సుజాతకు శనివారం లయన్స్ క్లబ్ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రూ.75 వేల విలువైన జెరాక్స్ మిషన్‌ను కళాశాలకు అందించడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు దుర్గాప్రసాద్, సుధాకరరావు, ప్రసాదరాజు, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నగదు, సెల్‌ఫోన్ చోరీ

రికవరీ చేసిన త్రీ టౌన్ పోలీసులు

బీచ్‌రోడ్డు: ముగ్గురు బాలలు ఓ మహిళ వద్ద నుంచి నగదు బ్యాగు, సెల్‌ఫోన్ చోరీ చేశారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆర్టీసీ కాంప్లెక్స్ దరి నైట్ ఫుడ్‌కోర్టు వద్ద షోడా షాపు నడుపుతున్న వెంకటలక్ష్మి అనే మహిళ శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంటకు షాపు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో.. కంచరపాలేనికి చెందిన ముగ్గురు బాలలు(మైనర్లు) బైకుపై వచ్చి ఆమెను బెదిరించారు. నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. దీంతో ఆమె 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయగా.. త్రీ టౌన్ క్రైం ఎస్ఐ, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శనివారం ఆ ముగ్గురిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసి.. రూ.20 వేల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురూ మైనర్లు కావడంతో పోలీసులు వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి, వారికి అప్పగించారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై సమీక్ష


మేడపాటి రవీంద్రకు క్రియాశీలక సభ్యత్వాన్ని అందజేస్తున్న పార్టీ నాయకులు

ఎంవీపీకాలనీ: బీజేపీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంపై పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర సమీక్ష నిర్వహించారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ నగర కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదులో విశాఖ జిల్లా మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1,53,000 సభ్యత్వాలు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ నెలాఖరు నాటికి 2 లక్షల సభ్యత్వాల మార్కు దాటేలా పార్టీ నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్ధ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లా, మండల స్థాయిలో వివిధ బాధ్యతలు పొందేందుకు పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు కీలకమన్నారు. జిల్లా తొలి క్రియాశీలక సభ్యత్వాన్ని అధ్యక్షుడు రవీంద్రకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.